క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోందని సమస్య పరిష్కరించాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి కోరారు. ఈ విషయంపై టు టౌన్ సీఐ రాజారెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశామన్నారు. దీనిపై సీఐ స్పందించారన్నారు. డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రామసముద్రం : నిమ్మనపల్లి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన అండర్–19 కబడ్డీ జిల్లా స్థాయి పోటీల్లో రామసముద్రం మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని పద్మజ ఇంటర్ సెకండ్ ఇయర్, కుదురుచీమన పల్లికి హై స్కూల్ కు చెందిన పదవ తరగతి విద్యార్థి శివమణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్, హెచ్ ఎం వేదవతి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, పీడీ ఇందిరా, హెచ్ ఎం, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బహుదా ప్రాజెక్ట్‌లోకి వెళ్లవద్దు

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు బహుదా ప్రాజెక్ట్‌లోకి ప్రజలు ఎవరూ వెళ్లవద్దని ఎస్ఐ తిప్పేస్వామి సూచించారు. శనివారం సాయంత్రం సిబ్బందితో కలిసి బహుదా ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ప్రాజెక్ట్‌లోకి దిగడం, ఈత కొట్టడం, సెల్ఫీలు తీసుకోవడం తదితర చర్యలను నిషేధించామన్నారు. బహుదా ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా

తంబళ్లపల్లె: ఇళ్లపై సోలార్‌రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చునని విద్యుత్‌శాఖ ఏఈ సురేంద్ర తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్త్ బిజిలి యోజన పథకంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సోలార్ ప్లాంట్‌పై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ థామస్ తెలిపారు. ఎల్ఎంఆర్ సోలార్ కంపెనీ ఇంజనీర్ మధుకర్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై వివరించారు. ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యపరచాలన్నారు. సదస్సులో డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలువ పనులకు వర్షం అంతరాయం

బి.కొత్తకోట: మండలంలోని గుండ్లపల్లె వద్ద హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువకు గండిపడి తెగిపోయిన విషయం తెలిసిందే. గండిపడిన కాలువకు రెండురోజులుగా మరమ్మతులు చేసి పునరుద్ధరించే పనులను ప్రాజెక్టు అధికారులు చేపట్టారు. అయితే శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండటంతో పనులకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే 80శాతం పనులు పూర్తి చేయించారు. మిగిలిన పనులను సాయంత్రంలోగా పూర్తి చేసే పరిస్థితులు ఉండగా వర్షం అంతరాయం కలిగించింది. అయితే నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరినట్టు ఈఈ అమరనాథ్‌రెడ్డి చెప్పారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

నిమ్మనపల్లె : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిమ్మనపల్లె మండలానికి చెందిన రౌడీషీటర్లు వివిధ అసాంఘిక కార్యక్రమాల కేసుల్లో నిందితులకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిందితులంతా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లరాదని, గొడవలు, దాడుల్లో పాల్గొనవద్దని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ట్రైనీ ఎస్ఐ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 సంస్కరణపై ప్రజల్లో చైతన్యం రావాలి

పీలేరు : జీఎస్టీ 2.0 సంస్కరణపై ప్రజల్లో చైతన్యం రావాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. విజయ్‌కుమారి అన్నారు. శనివారం జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశపు వస్తు, సేవల పన్ను వ్యవస్థలో కీలకమైన సంస్కరణల శ్రేణి 2.0 అని తెలిపారు. ఇది పేద ప్రజలకు వరంలాంటిదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీలో పాల్గొన్నవారికి లక్కీడిప్‌లో గెలుపొందినవారికి హెల్మెట్ ప్రదానం చేశారు.

నిబంధనలు పాటించకపోతే లైసెన్సు రద్దు

సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి


మిషన్ కాంపౌండ్‌లో దుకాణాల ఏర్పాటుపై అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు దీపావళిని ఆనందోత్సాహాలతో, ప్రమాదాలు జరగకుండా జరుపుకోవాలి. విక్రయదారులు నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అన్నారు. పట్టణంలోని మిషన్ కాంపౌండ్, నీరుగట్టువారిపల్లె టిప్పుసుల్తాన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేస్తున్న టపాసుల దుకాణాలను శనివారం సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ...మదనపల్లె డివిజన్ పరిధిలో మొత్తం 86 మంది టపాసుల విక్రయాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే టపాసుల దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుందని, నిబంధనలు పాటించని వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లైసెన్స్ లేకుండా టపాసుల దుకాణాలు నిర్వహించవద్దన్నారు. టపాసుల దుకాణ సముదాయంలో పార్కింగ్ స్థలాన్ని విధిగా ఏర్పాటుచేసుకోవాలన్నారు. దుకాణానికి, దుకాణానికి మధ్య 3 మీటర్లు దూరం ఉండాలని, ప్రతి దుకాణం ఎదుట విధిగా నీటి తొట్టె, ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప, తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాణా సంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

తంబళ్లపల్లె: దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు నిబంధనలు తప్పక పాటించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయస్టాళ్లను పరిశీలించారు. స్టాళ్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు సరైన భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. స్టాళ్ల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక యంత్రం అందుబాటులో ఉంచాలన్నారు. చిన్నపిల్లలను విక్రయస్టాళ్లల్లో పెట్టుకోరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వీఆర్ఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

పీలేరులో 37.6 మిల్లీమీటర్ల వర్షపాతం


: జలమయమైన పీలేరు ఆర్టీసీ బస్టాండ్

పీలేరు రూరల్ : పీలేరులో 37.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్‌వో రెడ్డెప్ప నాయుడు తెలిపారు. శనివారం పీలేరులో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపు నీటితో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమైంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా బస్టాండ్ ప్రాంగణం వర్షపునీటిలో మునిగిపోవడం సరామామూలైపోతోంది. అలాగే ఎల్‌బీఎస్ రోడ్డు మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణీకులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

హార్సిలీహిల్స్‌పై ..

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడుగంటల దాకా భారీ వర్షం కురుస్తూనే ఉంది. దీనితో కొండపై స్థానికులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండపై సంచరించేందుకు వీలులేక గదులకే పరిమితం అయ్యారు. ఘాట్‌రోడ్డుపై వర్షపునీటి ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గంగోత్రి చెరువు, చెక్‌డ్యామ్‌లోని నీళ్లు భారీగా చేరుతున్నాయి.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందాం

పీలేరు : కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందామని డిప్యూటీ హెచ్‌ఈవో కొండయ్య అన్నారు. శనివారం మండలంలోని తలపుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాలుష్య రహిత దీపావళిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పొగ, ధ్వని కాలుష్యం కలిగిన టపాసులు పేల్చుకోవాలన్నారు. తల్లిదండ్రులకు పిల్లలకు దగ్గరగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాటన్ దుస్తులు, కళ్ల అద్దాలు, ఎన్ 95 మాస్కులు ధరించాలని తెలిపారు. పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చరాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్‌ఎం ఫామున్నిసా, నాగవేణి, సీహెచ్‌వో కుముద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి చర్యలు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.40 కోట్లతో ఆర్‌అండ్‌బి రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చిత్తూరు ఎస్‌ఈ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని రహదారులను మదనపల్లె ఈఈ అరవిందాదేవి, డీఈఈ సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. బి.కొత్తకోట–రంగసముద్రం, బి.కొత్తకోట–కాండ్లమడుగు, బత్తలాపురం, టి.సదుం, గోళ్లపల్లె, కోసువారిపల్లె, కోటకొండ, దండువారిపల్లె తదితర రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులు, అభివృద్ధి చేయాల్సిన, కొత్త ర హదారుల నిర్మాణాలకు సంబంధించి పనులు చేపట్టేందుకు పరిశీలించామని చెప్పారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలి


స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె రూరల్ : స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మదనపల్లె పట్టణం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు తోడ్పాటు అందించాలని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్.రాధిక అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్.రాధిక మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాంకేతిక ప్రగతికి సైబర్ రక్షణే బలమైన పునాది

– థాయిలాండ్ ప్రొఫెసర్ శివశంకర్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివశంకర్

కురబలకోట: డిజిటల్ యుగం శరవేగంగా దూసుకెళ్తున్న తరుణంలో భవిష్యత్తును సృష్టించే విద్యార్థులే భారత సాంకేతిక భద్రతకు రక్షణ కవచంగా నిలవాలని థాయిలాండ్‌లోని చియాంగ్మాయి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ డిజిటల్ ఇన్నోవేషన్ ప్రొఫెసర్ డాక్టర్. ఆర్. శివశంకర్ పిలుపునిచ్చారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో భారతీయ సాంకేతిక కేంద్రాలను అనుసంధానించడంలో డిజిటల్ టెక్నాలజీలు, సైబర్ భద్రత సమస్యలు అనే అంశంపై శనివారం ఆయన మాట్లాడారు. దేశంలో బెంగళూరు, హైదరాబాదు, పూణె, చెన్నై, నోయిడా వంటి సాంకేతిక నగరాలు ప్రపంచ సాంకేతికపటంలో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయన్నారు. డిజిటల్ టెక్నాలజీ దేశాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రంగా మలచిందన్నారు. దేశం సాంకేతికంగా నెంబర్‌వన్‌గా ఎదగాలంటే బలమైన సైబర్ రక్షణ అవసరమన్నారు. గోప్యత, భద్రత, ఆవిష్కరణ సమతుల్యం కావాలన్నారు. ఆవిష్కరణ అద్భుతమే కానీ అది భద్రత లేనప్పుడు ముప్పుగా పరిణమించే అవకాశం ఉందన్నారు. అక్రమంగా చొర బడే ఒక్క హ్యాకర్ లక్షలాది మంది సమాచారాన్ని విశ్వాసాన్ని కొల్లగొడుతూ సాంకేతిక రంగానికే సవాల్‌గా మారుతున్నారన్నారు. సైబర్ రక్షణ విధానాలలో అవగాహన, శిక్షణతో పాటు నిరంతర పరిశోధన అవసరమన్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలి

మదనపల్లె రూరల్ : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట వెలుగుస్కూల్ వెనుక వైపు లక్షల రూపాయల విలువచేసే ప్రభుత్వభూములను సొసైటీ పేరుతో అమ్ముకుంటున్న కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి కే.మురళీ డిమాండ్ చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. జాతీయరహదారికి అతి సమీపంలో లక్షల రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలాల కబ్జాపై గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులకు ఫిర్యాదుచేసినప్పుడు పనులు ఆపేసి, కొద్దిరోజుల విరామం తర్వాత నిర్మాణాలు చేస్తున్నారన్నారు. కోళ్లబైలు పంచాయతీలో పలువురు దళారీలు, మధ్యవర్తులు.. సొసైటీ, కమ్యూనిటీ పేర్లతో ప్రభుత్వస్థలాలను ఆక్రమించి, పునాదులు వేసి బోగస్‌పట్టాలతో అమాయక ప్రజలకు అంటకట్టి రియల్ ఎస్టేట్ దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పునాదులు, చిన్నపాటి షెడ్ వేసిన ప్రభుత్వస్థలాలకు విద్యుత్ అధికారులు యథేచ్ఛగా మీటర్లు ఇస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కోళ్లబైలులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించి, కబ్జాచేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కారయక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెండో అతిపెద్ద బ్యాంకు ఏపీజీబీ

–చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

బి.కొత్తకోట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో రెండో అతిపెద్ద బ్యాంకు అని ఆ బ్యాంకు చైర్మన్ కే.ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. బి.కొత్తకోట మండలంలోని కనికలతోపు ఏపీజీబీ బ్రాంచ్ నూతన భవనంలోకి శనివారం మార్పు చేయగా ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బ్రాంచ్‌లో ఖాతాదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకుకు రాష్ట్రంలో 1,351 బ్రాంచీలు ఉన్నాయని చెప్పారు. దీనిద్వారా ఏటా రూ.1,26,023 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. ఈ బ్రాంచీల్లో 1.32 కోట్ల మంది ఖాతాదారులకు ఉన్నట్లు చెప్పారు. జాతీయ బ్యాంకులతో సమానంగా సౌకర్యాల కల్పనతోపాటు మెరుగైన వడ్డీ రేట్లు అమలు చేయడంలో ముందున్నామని చెప్పారు. రైతులకు వ్యవసాయ రుణాలు, పారిశ్రామిక, ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు సంబంధించిన రుణాలు ఇస్తున్నామని చెప్పారు. మెరుగైన సేవలు అందిస్తూ బ్యాంకు ప్రగతిపథంలో నడుస్తోందని చెప్పారు. చిత్తూరు ఓఎస్‌డీ శంకర్‌రావు, కడప ఓఎస్‌డి అరుణ్‌కుమార్, రీజనల్ మేనేజర్ శంకర్ ప్రసాద్, గోళ్లపల్లె బ్రాంచ్ మేనేజర్ జి.తేజస్వీని పాల్గొన్నారు.

జన గణన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి

మదనపల్లె: రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ పూర్తయ్యాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బొడెం రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అనిబిసెంట్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో వాటి గణన చేశాక స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తే బీసీ వర్గాలకు ప్రయోజనంగా ఉంటుందని అన్నారు. దీనిపై తాము పోరాటం సాగిస్తామని అన్నారు. తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు తెలిపాక అక్కడ ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు బంద్ నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పార్టీలు, ప్రభుత్వం మద్దతు ఇచ్చాక, బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చాక ఆందోళనలకు అర్థంలేదన్నారు. సమావేశంలో పాల్గొన్న గౌరవాధ్యక్షులు చిన్న రెడ్డెప్ప, నాయకులు సిద్దయ్య, కర్మద్‌బాషా, రామాంజనేయులు, వెంకటరమణ, వెంకటేష్, మోహన్‌బాబు, రాజుస్వామి, వెంకటరమణ, ఉప్పు వెంకటేష్, మోహనయాదవ్ సంఘీభావం తెలిపారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదు

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాచంద్రారెడ్డి

కేవీపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నూతన కాల్వ, ఎంపీపల్లె, తువ్వపల్లెలో పంచాయతీలలో మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించడమే లక్ష్యంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గత ప్రభుత్వంలో 7 మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి అయిందని తెలిపారు. 10 కళాశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మరో రూ. 5 వేల కోట్లు ఖర్చు పెడితే కళాశాలల నిర్మాణాలు పూర్తి అవుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతగాని తనంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనాలు పట్టించుకోకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరం అవుతుందని తెలిపారు. వైద్య విద్య ఫీజులు భరించలేనంతగా పెరిగిపోతాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదలి వైఎస్సార్‌సీపీ ప్రధాన నాయకులపై కక్ష సాధింపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచ్ ఆనందరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర, అస్లాం, జగదీష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, సిద్ధయ్య, రవిచంద్రారెడ్డి, గంగిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, మహేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనందరెడ్డి, సిరసాని వెంకటరమణారెడ్డి, గౌరిశంకర్‌రెడ్డి, గంపు జయరాఉ, పి. ద్వారకనాథ రెడ్డి, జయరామంద్రయ్య, సి.కె. యగ్రమరెడ్డి, రామ కొండారెడ్డి, వెంకటసిద్ధులు, దినేష్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఆంజినేయులు, దనుంజయ రెడ్డి, అప్పిరెడ్డి, రాజన్న, రామ్మోహన తదిరులు పాల్గొన్నారు.

కోర్టుకు భవనాలు పరిశీలన


కోర్టుకు భవనాల గురించి చర్చిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి అరుణసారిక

పీలేరు రూరల్ : పీలేరులో కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కోర్టును నిర్వహించడానికి స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న భవనాలను జిల్లా జడ్జి అరుణసారిక పరిశీలించారు. అలాగే మదనపల్లె రోడ్డు మార్గంలో నిరుపయోగంగా జడ్జి క్వార్టర్స్‌ను పరిశీలించారు. పీలేరులో జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను తాత్కాలికంగా డిగ్రీ కళాశాల భవనాల్లోకి మార్చేందుకు పరిశీలన చేపట్టారు. జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ , భార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సి. పురుషోత్తంరెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, డీటీ ప్రసాద్, ఎంపీడీవో శివశంకర్, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఖైదీల్లో సత్‌ప్రవర్తన రావాలి...

వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో సత్‌ప్రవర్తన రావాలని ప్రధాన జిల్లా జడ్జి అరుణసారిక అన్నారు. శనివారం స్థానిక సబ్ జైల్లో ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆర్థిక సోతమతలేని ఖైదీలకు ప్రభుత్వం ద్వారం ఉచితంగా న్యాయవాదిని అందిస్తామని తెలిపారు. జైల్లో ఏమైనా సమస్యలు న్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శ్రమదానంతో బెంగళూరు రోడ్డుకు మరమ్మతులు

మదనపల్లె రూరల్ : కడప–బెంగళూరు జాతీయరహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను బహుజన యువసేన ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పూడ్చి మరమ్మతులు చేపట్టారు. శనివారం పట్టణంలోని బెంగళూరు రోడ్డు సురభి కాలనీ, సిరికల్చర్ గ్రైనేజీ, అమూల్ డెయిరీ తదితర ప్రాంతాల్లో గోతులమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయమై బహుజన యువసేన(బీవైఎస్) ఆధ్వర్యంలో పలుమార్లు ఆర్‌అండ్‌బీ, హైవే అధికారులకు ఫిర్యాదుచేసినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలను నివారించేందుకు బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునీత్, సభ్యులతో కలిసి రోడ్డు మరమ్మతులకు పూనుకున్నారు. రోడ్డుపై ఉన్న గుంతలపై మట్టి పోసి పూడ్చారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానిబాషా, రెడ్డిశేఖర్, ఆది, వినయ్, హరికుమార్, బ్రహ్మ, శశికుమార్, కర్ణ, సిద్ధమల్లు, జగదీష్, గంగబాబు, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.